# పంచదార గుళికలు

బర.. బర.. బర.. బర.. బరబర...

సుబ్బారావుకి రోగం వచ్చింది. అది అట్టాంటి ఇట్టాంటి రోగం కాదు. బరబర రోగం.

ఎయిడ్స్ అనే మహామాయ రోగం కన్నా ప్రమాదకరమైన రోగమా! అంటే కాదనే చెప్పాలి. ఒక్కమాటలో చెప్పాలి అంటే తెలుగులో ఈ రోగం పేరు దురద.

ఆరోజు సుబ్బారావు ఆఫీసునుంచి వచ్చి విశ్రాంతిగా పడక్కుర్చీలో మేను వాల్చాడు. కాలుమీద కాస్త దురదపేసింది. మెత్తమెత్తగ గోక్కున్నాడు చీమకుట్టి ఉంటుందిలే అనుకుంటూ. ఆ తర్వాత చేతిమీద, బుగ్గమీద, నడుంమీద దురద పుట్టింది. దోమలు కుట్టాయేమోనని గోక్కున్నాడు అలా అనుకుంటూ.

అందుకలదు ఇందు కలదని సందేహము లేదు అన్నట్లు శరీరం మీద అయినచోట కానిచోట ఆమూలా ఈమూలా చెప్పే చోట్ల చెప్పని చోట్ల శరీరం మీద దురదలు బైలుదేరాయి.

గోక్కోటం ఎక్కువయిన తర్వాత గాని తెలిసిరాలేదు సుబ్బారావుకి ఇది చీమలు దోమలు పనికాదని మరేదో మాయరోగం అని.

సుబ్బారావు తన బామ్మతో కలిసి ఆ ఇంట్లో అద్దెకి ఉంటున్నాడు. బామ్మగారు నాలుగు రోజుల క్రితం యాత్రా స్పెషల్ పుణ్యక్షేత్రాలు చూసి రావటానికి వెళ్ళింది. ఇంకో రెండు వారాల తర్వాత గాని తిరిగి రాదు. అతగాడి బామ్మే ఉంటే దురదకి కారణం ఏమిటో చెప్పేది. దురద కూడా సమయం చూసుకుని మరీ వచ్చింది.

వానరాకడ ప్రాణం పోకడ ఎవరూ చెప్పలేరంటారు. వాన రాక చెప్పొచ్చు. మబ్బు లేకుండా వాన, ఉరముకుండా పిడుగు ఎలా సాధ్యం! దురద రాకడ ప్రాణం పోకడ అంటే అర్థం ఉంటుంది. బరబరమని అందిన చోటంతా గోక్కుంటూ అనుకున్నాడు సుబ్బారావు.

శరిరం మీద దద్దుర్లు, పొక్కులు లాంటివి నన్నుకైనా నక్కటం ఓ నక్కటి కూడా కానరాలేదు. ఎందుకైనా మంచిదని ఇంట్లో చిన్న భూతద్దం ఉంటే అది పెట్టి చర్మాన్ని పరీక్షగా చూసుకున్నాడు. సూక్ష్మమైన రోమాలు రోమ రంధ్రాలు కనవచ్చాయి కాని రోగం తాలూకు లక్షణాలు మాత్రం అణుమాత్రం కానరాలేదు.

చూద్దాం ఒకటి రెండు రోజులు అందినచోటల్లా బరుక్కుంటూ అనుకున్నాడు.

రెండు మూడు రోజులు గోక్కుంటూ ఉండంగానే ఇట్టే గడిచిపోయాయి. రోగం తగ్గకపోగా మరింత ఎక్కువయింది.

బరబర శబ్దం రాసాగింది.

ఒకటికి రెండు బాధలు. పరుల ఎదుట గోక్కోటానికి సిగ్గుగా ఉంటే రః బరబర శబ్దం ఒకటి. చచ్చే చావొచ్చి పడింది సుబ్బారావుకి. ఆఫీసుకి ఓ వారం శెలవు పారేసి హాయిగా గోక్కుంటూ ఇంట్లో నాలుగు గోడల మధ్య ఉండిపోయాడు.

దురద గురించి ఎవరినైనా అడుగుదామంటే మహా మొహమాటం, సిగ్గు కలిగాయి. గచ్చకాయ పుచ్చకాయ వైద్యాలా తెలియవు. పైగా ఏనాడూ డాక్టర్ ముఖం చూసిన పాపాన పోలేదు. ఈ దురద ఎలా తీరేను!

సుబ్బారావుకి అర్థం కాలేదు.



సొంత బుర్ర ఉపయోగించి ఓ ఉపాయం కనిపెట్టాడు. ఉడుకు ఉడుకు నీళ్ళు పోసుకుంటే దురద పోతుందేమోనని వళ్ళు కాలుతున్నా లెక్కచేయక అమ్మో అబ్బో అంటూ డాన్స్ చేస్తూనే వేడి వేడి నీళ్ళు రెండు బక్కెట్లు తలతో సహా (తలారా) పోసేసుకున్నాడు.

ఆ తర్వాత పది నిమిషాలు బాగానే ఉంది.

సుబ్బారావు హమ్మయ్య అనుకున్నంత సేపు పట్టలేదు. భయంకరమైన దురద బైలుదేరింది. వళ్ళు తడిసి ఉండటం వల్ల బరబర శబ్దం రాలేదు గాని భగ్గున మంటతో అగ్నిదేవుడు శరీరమంతా ఆవరించుకున్నట్లయింది.

వేడినీళ్ళ వైద్యం బెడిసి కొట్టడంతో సుబ్బారావుకి బుర్ర హోటెక్కి చల్లటి ఆలోచన వచ్చింది. వేడి నీళ్ళకి దురద తగ్గలేదు కాబట్టి చల్ల (చల్ల అనగా మజ్జిగ కాదు) నీళ్ళతో తలార స్నానం చేస్తే...? అనుకు అలా చేస్తే?

'వెధవ దురద కాదు గాని ఆలోచనలు బాగానే వస్తున్నాయి' అనుకున్న సుబ్బారావు చాలా లోతుగా (దాదాపు పది గజాల లోతు) ఆలోచించి చన్నీళ్ళ స్నానం [illegible]గా చేస్తూనే ఉన్నాను. ఈ చన్నీళ్ళు లాభం లేదు. అని అలా అనుకున్నవాడై రాత్రి పది గంటల వేళ బజారు కెళ్ళి నాలుగు కిలోల ఐసు ముక్కలు కొని రిక్షాలో

ఇంటికి చేర్చాడు.

రిక్షాలోంచి ఐసు గడ్డల ప్యాక్‌ని గది దాకా తీసుకు వచ్చిన రిక్షా అబ్బి బుర్ర గోక్కుంటూ (వాడికేం దురదో) అటూ ఇటూ తేరిపారచూసి 'పోయినాయన ఏరండి?' అని ఏవారంగా వినయంగా అడిగాడు.

'పోయినాయనా! ఆయన ఎవరు?' విరాగ్గా అడిగాడు సుబ్బారావు అసలే ఒళ్ళు చిరచిర లాడుతుంటే రిక్షా అబ్బి హాయిగా బుర్ర బరుక్కుంటూన్నాడే అదీ ఆ చిరాకు.

'ఆయన కాదా! ఆమె గారా! చిన్నా పెద్దా!' రిక్షా అబ్బి నలుమూలా కలియచూస్తూ అడిగాడు.

'ఏమిటయ్యా నీ ప్రశ్నలు! అడిగేదేదో సూటిగా అడగలేవూ!' సుబ్బారావు కయ్యిన లేచాడు.

'అదేనండి. శవం. వాలుక్కూడా దురద పుట్టిందేమో నామ్ఫు తూ అడిగాడు రిక్షా అబ్బి.

సుబ్బారావు ఒక్కసారిగా శిలలా బిగుసుకుపోయి అంతలోనే దురదతో చలనం రాగా రిక్షా అబ్బిని దులిపేశాడు.

రిక్షా అబ్బి తల గోక్కునే కార్యక్రమం ఆపేసి చేతులు నలుపుకుంటూ 'అక్కర్లకి పెళ్ళిళ్ళకి ఐసు గడ్డలు వాడతారని నాకు తెలియదు బాబూ! ఎన్నోసార్లు నా రిక్షా బండిలో ఐసు తీసుకెళ్ళాను. అక్కడ ఏడ్చే జనాలు, చచ్చిన శవము ఉండేవి. నేను ఐసు తీసుకెళ్ళి అక్కడ పెట్టంగానే దాన్ని చూసి ఆడోళ్ళు గొల్లుగొల్లున ఏడ్చేవాళ్ళు' అంటూ నొచ్చుకుంటూ చెప్పాడు.

'ఏడ్చినట్టే ఉంది' అనుకుంటూ వాడికి డబ్బులు ఇచ్చి పంపేసి అప్పటికప్పుడే రెండు బక్కెట్లలో ఐసు ముక్కలు వదేసి అవి కరగటానికి అర్థశేరు నీళ్ళు పోసి గరిటెతో తిప్పుతూ కూర్చున్నాడు.

ఐసు కరిగి నీళ్ళయింది. సుబ్బారావు డ్రాయర్లోకి మారిపోయాడు. అంటార్కిటికాలో అరగంట అటూ ఇటూ నడిచి మానస సరోవరం మధ్యలోకి దిగి కైలాస కోనలో తేలి బదరీనాథ్‌లో ఆగినట్లుగా మారింది సుబ్బారావు శరీరం. ఐసు నీళ్ళతో స్నానం పూర్తయ్యేసరికి.

పళ్ళు కొంకర్లు పోతుంటే కీళ్ళు బిగుసుకుపోతుంటే మంచు ముద్దగా మారిన సుబ్బారావు చలికి గిట్ట కర్చుకుపోయిన పళ్ళని ఎలాగో అలా కదిలించగ నోట్లోంచి హ... హో.. హో.... హో.. మ్మో.. మ్మో.. ఓ.. ఒ.. ఒ అనే గజిబిజి శబ్దం అదేదో పక్షికూతలా వచ్చింది.

మొద్దుబారిన శరీరానికి స్పర్శపోవటంతో తాత్కాలికంగా దురద పోయింది. బరువుగా భారంగా కదిలి బిగుసుకుపోయిన కాయాన్ని కుర్చీలోకి చేరేశాడు.

అరగంట తర్వాత మంచు కరిగి నీరయినట్లు చలి తగ్గి వేడి పుట్టుకు వచ్చింది. శరీరం యథాస్థితికి మారింది. తగుదునమ్మా అని పిలవని పేరంటానికి వచ్చిన లావుపాటి పిన్నిగారులా దురద వచ్చేసింది. షరా మామూలే.

అరచేతిని అడ్డుపెట్టి వరదనైనా ఆపొచ్చుగాని ఈ దురదని మాత్రం సహస్ర చేతులతో గోక్కున్నా తగ్గదు. వేడినీళ్ళూ పనికి రాక ఐసునీళ్ళూ పనికిరాక పోయే. ఇంక మిగిలింది గంటె కాలేసి వాతలు ఒళ్ళంతా పెట్టుకోటమే తరువాయి. రెండు చేతుల తాలూకా పదివేళ్ళకి పనికల్పిస్తూ ఏడ్చు ఒక్కటే తక్కువగా అనుకున్నాడు సుబ్బారావు.

ఉత్తప్పుడు బరబర శబ్దం వచ్చేది. వేడి నీళ్ళ వల్ల శబ్దం కాస్త తగ్గింది. ఐసు నీరు పోసుకునే సరికి శరీరం బండ బారిపోయిందేమో మరి గోక్కుంటుంటే ఈ తఫా శబ్దం ఎక్కువ రావటమే గాక బరబరకి తోడు గర గరమని కొత్త సౌండ్ బయిల్దేరింది.

అసలే కోతి ఆపై కాలులో ముల్లు విరిగింది. కంటిలో నలుసు పడింది. చెవిలో జోరీగ దూరింది కథలా మారింది సుబ్బారావు పరిస్థితి.

అసలే దురద ఆపై గీరుకున్న బాధ కాలిపోతున్న వేడినీళ్ళు, గడ్డకట్టే ఐసు నీళ్ళు. ఇప్పుడు కొత్తగా వికృత శబ్దాలతో సౌండ్ ఆఫ్ మ్యూజిక్. చచ్చే చావంటే ఇదేనేమో!

ఓ పక్క దురద. మరో పక్క బర బర గీరు గీరు శబ్దాల గోకుడు గోల. ప్రకృతి వైద్యం ఫలితంగా గీరిన చోట మంటలు. తెల్లారేసరికి సుబ్బారావు కళ్ళు మండిన పువ్వుల్లాగానూ, శరీరం కుమ్ములో పెట్టిన వంకాయలాగానూ దురద బాధతో ముఖం చిప్పిప్పిగానూ తయారయింది.

ఎంతకని గోక్కుంటాడు. ఎక్కడని గోక్కుంటాడు. ఇలా కాదని ఉదయం ఏడు గంటలకే తయారయి కొత్తగా బోర్డు తగిలించుకున్న ఎం.బి.బి.ఎస్ కుర్ర డాక్టరు దగ్గరకు వెళ్ళాడు. దురదకి సుబ్బారావు కొత్త ముఖం, ప్రాక్టీసుకి కుర్ర డాక్టరు కొత్త ముఖం.

అరగంట సేపు అన్ని పరీక్షలూ చేసి ఎలర్జీ అని ఒక్కముక్కలో రోగ నిర్ధారణ చేశాడు కుర్ర డాక్టరు.

'ఎలర్జీ అంటే?' సుబ్బారావు గీరు గీరు మని గోక్కుంటూ అడిగాడు.


'ఏదైనా పడకపోవటం'

'ఏదైనా అంటే?'

'తినే పదార్థాలు. వంకాయ, టెంకాయ లాంటివి. మనం పీల్చే గాలి. తాగే నీళ్ళు. గాలిలో వచ్చే వాసనలు' అంటూ దండకం చదివి ఎలర్జీ మాత్రలు రాసిచ్చి రెండు రోజుల పాటు ఇవి వాడండి. తగ్గిందా సరే తగ్గకపోతే ఎలర్జీ ఇన్‌స్టిట్యూట్‌లో చేరితే అక్కడ ఓ రెండు వారాలు ఉంటే అన్ని ప్రయోగాలుచేసి మీకు ఎలర్జీ ఏం పడకపోతే వచ్చిందో తేలుస్తారు. అప్పుడు పడని పదార్థం పూర్తిగా మానేసి ఎలర్జీ మందులు వాడితే సరి' అంటూ వివరించాడు కుర్ర డాక్టరు.

ముప్ఫై రూపాయల ఫీజు మూడు రూపాయల మాత్రలు రిక్షాకో పది రూపాయలు తగలేసి ఇంటికొచ్చి పడ్డాడు సుబ్బారావు.

ఎలర్జీ మాత్రలకి కూడా ఎలర్జీ వస్తుందేమో ఇంకా ఎవరూ కనిపెట్టలేదు గాని సుబ్బారావు కనిపెట్టాడు. ఎలర్జీ మాత్రలు రెండోది గొంతు దిగిందో లేదో కమిలిన వంకాయలాగా మారిన సుబ్బారావు శరీరం కందగడ్డలా మారింది. గోకిన తాలూకా కొండ



కురుమద్దాలి విజయలక్ష్మి

గుర్తులుగా సెమ్మ రేగిన చోట పుళ్ళు ఏర్పడ్డాయి.

ఇదేదో భయంకరమైన చర్మవ్యాధి, ఎం.బి.బి.ఎస్ డాక్టర్‌కి రోగం ఏమిటో ఎలా తెలుస్తుంది? (చర్మ వ్యాధి నిపుణుడు) స్కిన్ స్పెషలిస్ట్ దగ్గరకు వెళ్ళాలి గాని? అనుకున్న సుబ్బారావు మర్నాడు ఉదయానే స్కిన్ స్పెషలిస్టుని వెతుక్కుంటూ వెళ్ళాడు.

రకరకాల చర్మ రోగాలతో కిక్కిరిసి ఉన్న స్కిన్ స్పెషలిస్ట్ దగ్గరకు వెళ్ళి పేషంట్స్ దగ్గర కూర్చున్నాడు సుబ్బారావు. వాళ్ళందరినీ చూస్తుంటే అప్పుడు తెలిసింది చర్మరోగాలు ఎన్నిరకాలు ఉంటాయో.

ఎంతకీ పేషెంట్స్ తరగటం లేదు. సుబ్బారావు ఓ పక్క బర బర మరోపక్క గీరు గీరుమంటూ గోక్కుంటూనే పక్కనున్న ఆయనతో కబుర్లు మొదలు పెట్టాడు. కొద్దిసేపు కబుర్లు అయాక 'మీకొచ్చింది చర్మరోగం కాదు, సుహోసర్పి' అన్నాడు సుబ్బారావు శరీరాన్ని పరికించి చూస్తూ.

'సుహోసర్పియా! అదేం వ్యాధి' సుబ్బారావు కాలుమీద గీరుకుంటూ అడిగాడు.

'విష సర్పం ఊదితే ఆ గాలి తగిలి చర్మమంతా రోగగ్రస్తమవుతుంది. అదన్నమాట. తామర గజ్జిని మించిన చర్మ వ్యాధులు ఏముంటాయి? ఇక్కడ ఇంతమంది ఉన్నారు. అందరికీ శరీరం మీద ఏదో ఒక చోట వ్యాధి ఉంటుంది. మీకలా కాదే వళ్ళంతా పుచ్చిపోయినట్లు ఉంది పులిసిపోయినట్లు అలా దురద. ఇది వ్యాధి కాదు సుహోసర్పి' అంటూ పక్కనున్న గజ్జి పేషెంట్ సుబ్బారావు చెవిలో శంఖంలా ఊదాడు.

ఫలితం

సుబ్బారావు వంతు వచ్చి డాక్టరు దగ్గరకు వెళ్ళేసరికి డాక్టరు గారికి తనకొచ్చిన ఈ దురద సుహోసర్పి అంటూ సుబ్బారావే చెప్పేశాడు.

'నేనా డాక్టర్ని నీవా?' స్కిన్ స్పెషలిస్టు చిత్తరంజనరావు చిరాకు పడుతూ అడిగాడు.

'నేను డాక్టర్ని అయితే మీ దగ్గర కెందుకొస్తాను?' జోకేశాడు సుబ్బారావు. అంతటితో ఊరుకోక సుహోసర్పి కాకపోతే ఎలర్జీ అంతే కదా! అన్నాడు.

'నేనా డాక్టర్ని నీవా?' కయ్యిమన్నాడు డాక్టర్ సాబ్.

'మాటకు ముందు ఈ అనుమానం మీకెందు కొస్తున్నదో ఈ దురదలాగానే నాకర్థం కావటం లేదు. అనుమానంగా చూస్తూ అన్నాడు సుబ్బారావు.

ఒక్కోరోజు లేచిన వేళా విశేషం. డాక్టరు వకటన్నాడు. సుబ్బారావు మరొకటి చెప్పాడు. అంత పెద్ద పేరున్న స్కిన్ స్పెషలిస్టు కూడా సుబ్బారావుకి వచ్చిన దురద రోగం పేరు చెప్పకుండా మాత్రలు రాసిచ్చి రెండు రోజులు వాడి తర్వాత వచ్చి కనపడమని చెప్పాడు.

సుబ్బారావేమన్నా తెలివి తక్కువ వాడా, మెడికల్ షాపులో మాత్రలుకొంటూ ఇవి దేనికి వాడుతారని అడిగాడు. 'ఎలర్జీకి వాడతారు' చావు కబురు చల్లగా చెప్పినట్లు చెప్పాడు షాపతను.

'ఎంత మోసం! రోగ నిర్ధారణ చేయలేదు. రోగంపేరు చెప్పలేదు. వేడి నీళ్ళ వల్ల (ట) నీళ్ళ వైద్యం చేశానంటే ముఖాన ఓ వెధవ నవ్వు నవ్వి చివరకి ఈ మాత్రలు రాసిస్తాడా! ఈయనేం స్కిన్ స్పెషలిస్ట్! పై జన్మంటూ ఉంటే నా దురదలు ఆయనకి రావాలి కనీసం ఆరునెలలు గీరుకుంటూ ఉండాలి' అని శాపం పెట్టి మాత్రలు కొనటం మానేసి ఇంటి దారి పట్టాడు సుబ్బారావు.

విలుమొదిలినా (డబ్బు) ఫీదం (వికారమైన దురద) వదలని సుబ్బారావుకి అరగంట తర్వాత కొత్తాలోచన వచ్చింది. హోమియోపతి వైద్యం మీద బొత్తిగా నమ్మకం లేదు. ఇప్పుడు నమ్మకం కాదు ముఖ్యం దురద వదలటం. ఏ పుట్టలో ఏ పాముందో ఏ దురదకి ఏ మందు పడుతుందో ఎవరికి ఎరుక? హోమియో డాక్టరు దగ్గరకు వెళితే రోగం కుదరవచ్చు కదా!

అలా అనుకున్న సుబ్బారావు ఆ మర్నాడే హోమియోపతి వైద్యుడు వెంగళావధాని దగ్గరకు వెళ్ళాడు. పంచదార గుళికల మీద కూడా ఎందరికో నమ్మకం ఉందనటానికి నిదర్శనంగా అక్కడ కూడా రోగులు ఈగల్లా ముసిరి ఉన్నారు.

బెల్లం చుట్టూతా ఈగలు ముసరనా ఏంటి? ఇచ్చేది పంచదార మాత్రలు ఏ బాధా లేకుండా స్వీట్ గోలీస్ చప్పరించవచ్చు. అనుకున్న సుబ్బారావు డాక్టర్ గారి ముందున్న టేబుల్ మీదున్న రెండంగుళాల సీసాలు వాటిల్లోని తెల్లమాత్రలు చూసి తెల్లముఖం వేశాడు.

తెల్లటి తియ్యటి మాత్రల వైద్యం హోమియోపతి వైద్యం అన్నంత వరకే తెలుసు సుబ్బారావుకి. ఆ వైద్యం గురించి చదవటం వినటం లోతుగా చెయ్యలేదు. హోమియోపతి మాత్రలు తియ్యగా ఉంటాయి కాబట్టి చప్పరిస్తారని విని ఉన్నాడు. ఒక్కో మాత్ర రోగాన్ని బట్టి గోలీకాయ, కుంకుడు గింజ. ఉసిరి కాయ, చిన్న సైజు నిమ్మకాయ. పిప్పరమెంటు చాక్‌లెట్స్ అలాంటి సైజుల్లో ఆ రకమైన ఆకారాలతో బహు తియ్యగా ఉంటాయి. చేదుమందుని లోపల పెట్టి పైన పంచదార పాకం లాంటిది పోసి కవరింగ్ చేస్తారు. అనుకున్న సుబ్బారావు ఆవాలసైజు, పెసరబద్ద సైజు గల హోమియో పతి మాత్రలు చూసి ఖంగుతిన్నాడు.




(పాతికేళ్ళ సుబ్బారావుకి హోమియోపతి వైద్యం తెలియకపోవచ్చు. ఆ మాత్రలని చూసి ఉండకపోవచ్చు. అది విడ్డూరమూ కాదు. చోద్యమూ కాదు. మా ఆవిడని స్వాములవారి దగ్గరకు పంపించాను ఆయన దయవల్ల మా ఆవిడ కడుపున ఓ కాయ కాసింది అని చెప్పే తెలివి తక్కువ భర్తలున్న ఈ పవిత్ర భారతదేశంలో హోమియో వైద్యం తెలియని సుబ్బారావు లాంటి వాళ్ళు ఉండటంలో వింతేముంది?)

హోమియో మాత్రలు ఆవాలసైజు పెసర బద్దంత సైజు ఉండటం ఓ విచిత్రం అయితే వేరువేరు రోగాలకి అవే మాత్రలు ఇచ్చి పంపించటం మరో విచిత్రం. (కాకపోతే ఓసారి ఆ సీసాలోని మరోసారి ఈ సీసాలోని ఇవ్వటం చేస్తున్నాడు వైద్య శిఖామణి)

సుబ్బారావు వంతు ఇంకా రాకపోయేసరికి పేషంట్స్‌ని డాక్టర్‌ని చూస్తూ కూర్చున్నాడు.

ఓ లావుపాటి పిన్నిగారు పదిహేను పదహారు ఏళ్ళున్న ఓ అమ్మాయి వంతు వచ్చింది. డాక్టరు గారి ఎదురుగా చెరో కుర్చీలో కూర్చున్నారు.

'వ్యాధేమిటి! డాక్టరు దగ్గర కొచ్చింతర్వాత సిగ్గుపడకూడదు. వివరంగా చెప్పండి రోగం ఎలా తెలుస్తుంది?' అని డాక్టరు గారు తియ్యతియ్యగా మందలించిన తర్వాత పిల్లదాని నోరు తెరువబడింది. గొణిగి నట్లే చెప్పింది తన రోగ బాధ.

అంతా విని 'ఇది కుసుమ వ్యాధి' అన్నాడు హోమియోపతి వైద్య శిఖామణి వెంగళావధాని.

'అంటే' అంది ఆ పిల్ల.

'అంటే బట్ట విడుపు వ్యాధి. తెల్లబట్ట అని మీ భాషలో అంటారు'

'తెల్లబట్టలా!' అంది ఆ పిల్ల.

'తెల్ల బట్టలూకాదు పట్టుబట్టలూ కాదు' ఆ పిల్లతో అని పక్కనే ఉన్న లావుపాటి పిన్నిగారితో 'మీకు కుసుమ వ్యాధి ఉందా!' అనడిగాడు వెంగళావధాని.

ముఖం చిటచిట లాడిస్తూ 'నాకెందుకుంటుంది?' మాట సాగదీస్తూ అంది లావుపాటి పిన్నిగారు.

'కొన్ని వ్యాధులు తల్లుల నుంచి పిల్లలకి వస్తాయి అందుకడిగాను' అన్నాడు వెంగళావధాని.

'నేను అమ్మనికాను. వీళ్ళ పక్కింటి ఆవిడని. తోడుకోసం వచ్చాను' అంది లావుపాటి పిన్నిగారు.

'ఓహో అలాగా' అని మళ్ళీ ఆ పిల్లవేపు తిరిగి 'పెళ్ళైందా!' అనడిగాడు.

'ఇంకా లేదు. మావాళ్ళు సంబంధాలు చూస్తున్నారు.' ఆ పిల్ల బోలెడు సిగ్గు పడుతూ చెప్పింది.

'మీ అమ్మకిగాని మీ అమ్మమ్మకి గాని ఈ వ్యాధి ఉందేమో నీకేమన్నా తెలుసా?'

పెళ్ళికాని వాళ్ళకే ఈ వ్యాధి వస్తుందేమోనన్న దురభిప్రాయం ఆ పిల్ల దానికి కలిగినట్లుంది. మా అమ్మకి మా నాన్నతో పెళ్ళయిందండి. మా అమ్మమ్మ నేను పుట్టకముందే చచ్చి స్వర్గం చేరుకుందండి' అని చెప్పింది.

'మీ అమ్మకి పెళ్ళి కాందే నీవెలా పుడతావు లెమ్మా!' అని మళ్ళీ మహాభారతంలోని అందాలు చిందే టి.వి కుంతీదేవి గుర్తుకు రాగా 'జన్మ నివ్వటానికి పెళ్ళికి సంబంధం ఏముందిలే' అని గొణిగి ఆపై ఇలాంటి దిక్కుమాలిన ప్రశ్నలు బోలెడన్ని వేసి.. ఆ పిల్ల దాని కున్న రోగ లక్షణాలూ 'మీకున్నాయా!' అంటూ లావుపాటి పిన్నిగారిని అడిగి.. 'నాకెందుకుంటాయి' అంటూ లావుపాటి పిన్ని గారి చేత సన్నసన్నగ చివాట్లు తింటూ చివరికి రోగ నిర్ధారణ చేసి 'కరేపాకు కొతిమెర, వంకాయ, ఇంగువ, వెల్లుల్లి లాంటివి తినొద్దని చెప్పి వేలెడంత సీసాలు రెండు పైకి తీసి అన్నం పైన మాత్రలు నాలుగేసి చొప్పున పొట్లం గట్టి ఆ పిల్ల దాని కిచ్చి పంపించేశాడు వెంగళాచారి.

ఈ విధంగా నలుగురైదుగురు రోగులు వాళ్ళ రోగాలు చెప్పి మందులు తీసుకెళ్ళిం తర్వాత సుబ్బారావు వంతు వచ్చింది.

సుబ్బారావు ఎగాదిగా చూస్తూ ఊ అన్నాడు వెంగళాచారి.

'దురద' సిగ్గుపడుతూ చెప్పాడు సుబ్బారావు.

'అది కాదు' అన్నాడు వెంగళాచారి.

'ఖర్మ ఈయనగారికి భాష కూడా మార్చి చెప్పాలి కాబోలు'నని అనుకున్న సుబ్బారావు 'ఒకటే కంపరం ఒళ్ళంత' అన్నాడు.

'అది కాదు' అని చెప్పి చూపుడు వేలుని బొటన వేలితో మీటి పైసలు అనే అర్థం వచ్చేలా వేళ్ళు మీటాడు వెంగళాచారి.

ఫీజు అని అర్థమైన సుబ్బారావు యాభై రూపాయల నోటు తీసి ఆయన ముందుంచాడు. పదో పరకో తీసుకుని చిల్లర నోట్లు ఇవ్వకపోతాడా అని.... చిల్లర నోట్లు ఇచ్చే పిచ్చివాని గాని ఫీజు ఇంతని గాని చెప్పకుండా యాభై రూపాయల నోటు తీసుకుని ఓసారి కళ్ళకద్దుకుని తన ముందున్న డ్రాయరు సొరుగులో పడేసుకున్నాడు ఆయన.

'అవునూ ఈ శబ్దం ఏమిటి? బైట ఎవరన్నా రంపంతో చెక్క కోస్తున్నారా!' వెంగళాచారి తన చెవిని వాకిలి దాకా పోనిచ్చి అడిగాడు.

ఫీజు తీసుకున్న వాడు తన రోగం గురించి అడక్కపోగా ఈ ప్రశ్న ఏమిటి! చెక్కపనివాళ్ళు కత్తులు సానబట్టే వాళ్ళని చూసి ఈయనగారి దగ్గరకు రావాలా?' అనుకుంటూ సుబ్బారావు బుర్ర కాయని బరబర గోక్కున్నాడు.

'హుర్రే' అంటూ ఆనందాశ్చర్యాలు ఏకకాలంలో ప్రకటిస్తూ 'గీరు గీరు ఈ శబ్దం నీ బుర్ర మీదనుంచి వస్తున్నదా? ముందే చెప్పావుకాదేం బైట ఎవరన్నా చెక్కలు కోస్తున్నారేమో అనుకున్నానుమా' అంటూండగానే సుబ్బారావు ఓ వెర్రి నవ్వు నవ్వి ఒళ్ళు బరబర గోక్కోటం మొదలుపెట్టాడు.

ఈ తఫా వెంకటాచారి కిర్ కిర్ మని నవ్వి 'నీ శరీరం చాలా తమాషాగా ఉందోయ్. బుర్రకాయ గీరుతే గీరు గీరు శబ్దం వచ్చింది. ఒళ్ళు గోక్కుంటే బరబరా అంటున్నది ఏమిటి? అనడిగా

'బర బర గీరుగీరు అంతే' రెండు చేతులు వెనక్కి పోనిచ్చి వీపు గీరుకుంటూ చెప్పాడు.




'ఈ రెండూ కాక మరి నాలుగైదు రకాల శబ్దాలు నీ ఒంటి మీద వచ్చినట్లయితే గిన్నిస్ బుక్ లోకి నీ పేరు, నీవు ఎక్కేవాడివి బాడ్‌లక్. సరే ఈ శబ్దం ఏమిటి? ఇంతకీ నీ కొచ్చిన రోగం ఏమిటి?' గిన్నిస్ బుక్‌లోకి ఎక్కని దురదృష్టవంతుడిని అన్నట్లు ముఖం పెట్టి అడిగాడు వెంగళాచారి.

'ఇదే నా రోగం. శబ్దరంజని. గోకితే చాలు బరబర గీరు గీరు' ఎడాపెడా గోక్కుంటూ చెప్పాడు సుబ్బారావు.

'గోకటం మానేస్తే శబ్దాలు నాటంతటవే ఆగిపోతాయి కదా!'

ఉత్త శబ్దం అయితే నిశ్శబ్దంగానే ఉండేవాణ్ణి. ముందు దురద ఆ తర్వాతే శబ్దాలు మొదలైంది పళ్ళ బిగువున కోపం ఆపుకుంటూ చెప్పాడు సుబ్బారావు.

'ఇదేం దురద!' తలగోక్కుంటూ అడిగాడు వెంగళాచారి.

'అది తెలియకనే మీ దగ్గరకొచ్చింది. మీకూ తెలియదంటున్నారు నే వెళతాను. నా పాట్లేవో నేనే..'

'ఎంతలావు దురదుంటే మాత్రం ఇంత లావు తొందర పనికి రాదు. బర బర కాకపోతే చిరచిర గోక్కో. నాకు దురద వ్యాధి గురించి తెలియక కాదు. దురదల్లో వంద రకాలు ఉన్నాయి. ఇదేరకం దురదో అని ఆలోచిస్తూ ఇదేం దురద అన్నాను. అంతేగాని ఇది ఎక్కిరింపు కాదు. దురద గురించి తెలియక కాదు.

వెంగళాచారి అలా అని నొక్కి వక్కాణించి చెప్పేసరికి సుబ్బారావు నమ్మేశాడు. ఆ తర్వాత వాళ్ళ మధ్య మాటలు ఇలా సాగాయి.

'ఎన్నాళ్ళ బట్టీ ఇలా గోక్కోటం' వెంగళాచారి అడిగాడు.

'దురద ఏర్పడిన నుంచీ ఇదిగో ఇలా రెండు చేతులా పనేనండి. బరబర మని కాళ్ళమీద గీరుగీరుమని పొట్టమీద గోక్కుంటూ రవ్వంత సిగ్గుతో చెప్పాడు సుబ్బారావు.

దురద ఎప్పటినుంచి అని.. మతారంగ తలగోక్కుంటూ అడిగాడు వెంగళాచారి.

'మీకు కూడా దురద ఉన్నట్లుంది?' సుబ్బారావు ఆయన చేతికేసి తలకేసి చూస్తూ అడిగాడు.

'ఇది రోగం కాదు అలవాటు' అని చెప్పి మళ్ళీ గోక్కోబోతూ తెలివి తెచ్చుకుని ఆగిపోయాడు.

'వారం రోజుల నుంచి మొదలైంది.. అంటూ మొదలు పెట్టి వేణ్ణీళ్ళ వైద్యం, చన్నీళ్ళ వైద్యం ఎలర్జీ మాత్రలు.. బరబరమంచి — గీరు గీరు శబ్దాలు.. అన్నీ వివరంగా చెప్పాడు సుబ్బారావు.

'అడ్డెడ్డె నీవు చాలా తప్పు పని చేశావోయ్. దురద పుట్టంగానే నా దగ్గరకు వచ్చినట్లయితే కనీసం ఈ శబ్దం బాధలన్నా తగ్గేవి. గృహ వైద్యం లంకకు చేటన్నారు. (గృహ వైద్యానికి లంకకి సంబంధం ఏమిటో ఆయనకే తెలియాలి మరి) నీ సొంత వైద్యం కొంపదీసిందనుకో, అద్సరే ఇంగ్లీషు వైద్యుడి దగ్గరకు దేనికి వెళ్ళావ్! కత్తి పట్టి పరపర కోసి కత్తెరపట్టి కరకర కత్తిరించి సూది దారంతో చకచక కుట్టేసే వైద్యం. దురద గురించి ఆ వైద్యంలో మందులే లేవు. దురద అంటే చాలు ఎలర్జీ అంటారు. సర్సరే ఇప్పటికైనా వచ్చావు సంతోషం.

వెంగళాచారికి సంతోషం దేనికో అక్కడా ఇక్కడా ఎడా పెడా గోక్కుంటున్న సుబ్బారావుకి అర్థం కాలేదు.

'మీ తండ్రికి తాతకి అమ్మకి అమ్మమ్మకి మీ వంశంలో ఎవరికైనా సరే ఇలాంటి దురద ఉండేదా!'

'నాకు తెలియదండి. వాళ్ళు గోక్కోగా నేనెప్పుడూ చూడలేదు. అయినా నాకు దురద నాకు గానీండి వాళ్ళకు కాదు కదా!'

హోమియో వైద్యం గురించి ఏమీ తెలియని వాళ్ళు ఇదిగో ఇలాగే తెలివి తక్కువ ప్రశ్నలు వేస్తారు. ఏడు తరాల చరిత్ర తీస్తే రోగి కొచ్చిన రోగం ఏ తరంలో ఎవరికి వచ్చిందో తెలుస్తుంది. ఈ వైద్యంలో మేము అంత వెనక్కి వెళతాము.

'ఏడు తరాల చరిత్ర గురించి ఏడుకొండలెరుగు గాక. మా వంశంలో మాత్రం ఈ తరం చరిత్ర కూడా నాకు తెలియదు. సుబ్బారావు తప్పుచేసిన వాడిలా తల దించుకుని మెడమీద గోక్కుంటూ చెప్పాడు.

'బాడ్‌లక్, పోనీలే, ఇది పాత తరం నుంచి గాక కొత్త తరం నుంచి తగులుకుని ఉండవచ్చు. అటునుంచి కుదరదు కాబట్టి ఇటునుంచి నరుక్కొద్దాం. నీకు పెళ్ళయిందా!'

'అయిందండి'

'నీ భార్యకి ఇలా దురద...'

సుబ్బారావుకి ఒళ్ళు మండింది, పళ్ళ బిగువున కోపం ఆపుకుని 'పెళ్ళి వరకే నాకు తెలుసు. ఆపైన ఏమీ జరగలేదు. ఇంక దురద గురించి నాకెలా తెలుస్తుంది? పైగా పెళ్ళిలో అది గోక్కోడం నేను చూడలేదు అని చెప్పాడు ఎందుకైనా మంచిదని మా అత్తా మామలకి కూడా ఏ దురదా లేదు' అని అదీ చెప్పాడు.

'వంశవృక్షంలోని దురద తెలియదు. అత్తారి వైపు దురద లేదు బాడ్‌లక్. అయినా ఫరవాలేదు. ఈ దురద ఎలా వచ్చింది నేనూస్తా కదా! దురదయినా బురదయినా కారణం లేకుండా రాదు కదా! ఫరవాలేదు గోక్కో. పెద్దలంటారు కాయం నిగ్గెరగదని. అది సరికాదు. నన్నడిగితే దురద సిగ్గెరగదంటాను.. వెంకటాచారి మాటలకు అడ్డువస్తూ 'నా బర బర.. దురద.. గీరు గీరు..' శబ్దం చేస్తూ అడిగాడు సుబ్బారావు.

'ఆ..ఆ.. సరిగ అక్కడికే వస్తున్నాను. నా ప్రశ్నలకి టక టక సమాధానం ఇవ్వు. రాత్రిళ్ళు బైటకెళ్ళే అలవాటుందా! సిగ్గుపడకుండా చెప్పు.

'ఉంది' సుబ్బారావు సిగ్గుపడుతూనే చెప్పాడు.

'అక్కడికేనా!' కనుబొమలు ఎగరేస్తూ అడిగాడు వెంగళాచారి.

'అక్కడికంటే?'

'అక్కడి కన్నా ఇక్కడికన్నా వేరే చోటికి రాత్రి తొమ్మిది దాటంగానే చాలామంది వెళ్ళే చోటుకి'

సుబ్బారావు రెండు మెలికలు తిరిగి మళ్ళీ గోక్కోటంలో మునిగి పోయాడు.

'వారానికి ఎన్నిసార్లు వెళుతుంటావ్'

'రెండు సార్లు. ఎప్పుడైనా వారానికి మూడు సార్లు. కనీసం రెండు మూడు సార్లయినా వెళ్ళకపోతే పిచ్చెక్కినట్లు ఉంటుందను కోండి. మా చెడ్డ అలవాటయిపోయింది' సుబ్బారావు చెప్పాడు.

'వయస్సు ప్రభావం. అలవాటు కానంతవరకే ఏదైనాను. అన్నట్టే యూరిన్ పచ్చగ వస్తున్నదా! ఎర్రగ వస్తున్నదా!

'నేను చూడలేదండి'

'అదేంటి యూరిన్‌కి వెళ్ళేటప్పుడు చూసుకోవా?'

'ఉహూ ఏదో అలా పోసుకుని ఇలా రావటమే' బోలెడు సిగ్గుపడుతూ చెప్పాడు సుబ్బారావు.

'రాత్రిళ్ళు అక్కడికెళటానికి లేని సిగ్గు యూరిన్ కలర్ చూసు కోవటానికి వస్తుంది. అవునులే అక్కడ పంచరంగులను ఇంద్రధనస్సు కలర్‌లోనూ కానవస్తాయి కదా! కేసు అర్థమయింది. అక్కడి కెళ్ళ టం వల్లనే ఈ దురద వచ్చింది. వారం తిరక్కుండానే వ్యాధి ముదిరిపోయింది. రేపు నీ భార్య కాపురాని కొచ్చింతరువాత కూడా వెళతావా?'

'ఇష్టమైన చోటికి వెళ్ళకుండా ఎలా ఉంటానండీ!'

'నీ ఆవిడ వూరుకోవద్దూ!'

'ఇద్దరం కలిసే వెళతాం కదా!'

ఆ సమాధానం వినగానే పిడుగుల్లు పడ్డాయి వెంగళాచారికి. తెలివి తెచ్చుకుని బరబర బుర్ర గోక్కున్నాడు.

'మీ క్కూడా నా దురద వచ్చేసిందండోయ్! మీరలా గోళ్ళు అరిగేలా గోక్కుంటుంటే బరబర శబ్దం వస్తున్నది భలే భలే' ఆనందంగా గోక్కుంటూ చెప్పాడు సుబ్బారావు.

'సుఖ వ్యాధులు ముదిరితే చివరి స్టేజీలో బుర్ర వెడిపోయి పిచ్చి లక్షణాలు ఏర్పడతాయి...'

వెంగళాచారి మాటలకి మధ్యలోనే అడ్డు తగులుతూ వ్యాధులకి సుఖమేమిటి నా బొంద. ఇదిగో ఇలా దురద పుడితే గోక్కుంటుం టే చమ్మగా సుఖంగా ఉంటుంది. అదైనా చర్మం ఊడిందాకానే, ఆ తర్వాత మంట. మంటే మంట. దీనిని సుఖ వ్యాధి అనరుకదండి. హ హ్హ హ్హ.. అన్నాడు సుబ్బారావు.

'నీ కొచ్చింది సుఖవ్యాధి. నీ పిచ్చి నవ్వు లక్షణం కూడా అదే'

'వాది పిచ్చినవ్వా! బాగుంది బాగుంది. దురద పేరు సుఖవ్యాధి బాగుంది బాగుంది' బర బర గోక్కుంటూ సుబ్బారావు అన్నాడు.

'దురద పేరు సుఖ వ్యాధి కాదు. రాత్రిళ్ళు అడ్డమైన ముండల దగ్గరకెళ్ళి తగిలించుకొచ్చావే అది సుఖ వ్యాధి. అది సుఖంగా ఒళ్ళంతా వ్యాపించి దురద రూపంతో బైటికి వచ్చింది. రోగాలు తగిలించుకున్నదే గాక పిచ్చి ఆర్గ్యుమెంటు. అది చాలక భార్యని కూడా వేశ్యావాటికకి తీసుకెళతాననటం. ఏంటయ్యా ఇది' సుబ్బా రావు యొక్క దురదని దులిపేయ లేకపోయినా మాటలతో దుమ్ము ని దులిపేశాడు వెంగళాచారి.

ఆ దెబ్బతో విషయం అర్థమైంది సుబ్బారావుకి. సుఖవ్యాధులం టే వేశ్యల దగ్గరకు వెళితే వచ్చేవన్నీను.. తాను రాత్రిళ్ళు వారానికి రెండుసార్లు వెళ్ళేది అక్కడికే నసీను..

బరబర గోక్కొని హహ్హాహ్హా.. అని ముఖం మీదే నవ్వుతూ బుగ్గలపై గీరుగీరు మని గీక్కుంటూ నేను వారానికి రెండు మూడుసార్లు రాత్రిళ్ళు వెళ్ళేది తెలుగు సినిమా కొచ్చి' అని చెప్పేసి చేతులు రెండూ దులుపుకుని హాయిగా గోక్కోటం మొదలు పెట్టా డు సుబ్బారావు.

'సినిమాలకా!' అంటూ తెల్లముఖం వేశాడు వెంగళాచారి.

ఆ తర్వాత...

'వెళుతున్నది సినిమాలకని చెప్పావు కదా!' అని వెంగళాచారి అడిగేదేదో డైరెక్టుగా అడక్క కనుబొమలు ఎగరేసి అక్కడకా! అని గూడలెగరేసి వారానికి మూడు సార్లా అబ్బో అని.. ఎదురుగ నేనున్నా ను. నా వ్యాధేమిటో గోక్కుంటూ మరీ చెప్పాను. కళ్ళారా చూస్తూ కూడా వంశవృక్షాలు తిరగేయటం.. పైగా వేశ్యల దగ్గర కెళ్ళావని నా శీలం శంకించటం... అని సుబ్బారావు దడదడ మాటలనుకున్నారు.

'నేను నమ్మను. మేము మంచిగ అడిగినా రోగి నిజం చెప్పడు. నీ లాంటి వాడే ఆ మధ్య నా దగ్గరకొచ్చి సుఖవ్యాధిని దాచి ఏదో పై పై రోగం చెప్పాడు. మాత్రలిచ్చి పంపాను. హోమియో వైద్యం అంటే మజాకా కాదు. రెండు డోసులు మాత్రలు వేసుకున్న తర్వాత ఇంతకి పదింతలు రోగం ఎక్కువవుతుంది. ఆ తర్వాతే తగ్గుతుంది...

'నాకైనా అంతేనా!' గుండె చిక్కబట్టుకుని అడిగాడు సుబ్బారా వు.

'నీవేమన్నా దేముడివా! నీదేమన్నా స్పెషల్ కేసా! దురద.. రెండు డోసులు మాత్రలు అలా గొంతు దిగంగానే ఓ వారం రోజుల పాటు దురద పదిరెట్లు ఎక్కువయి పాత చర్మ రోగాలు ఏమన్నా శరీరంలో ఉంటే పైకి వస్తాయి. ఆ తర్వాతనే తగ్గుముఖం పట్టటం అన్నమాట. వెంగళాచారి చెప్పడం ఇంకా పూర్తి కాలేదు.

అన్న మాట తమ్ముడి మాట బాగుంది చాలా బాగుంది. మీరు చెప్పేది గోక్కున్నంత గొప్పగా హాయిగా ఉంది. ఈ దురదతో గోకి గోకి గోళ్ళు అరిగాయి. చర్మం పెచ్చురేగి పుళ్ళు పడ్డాయి. మీ దిక్కుమాలిన వైద్యంతో దిక్కు మాలిన దురద పదిరెట్లు పైకి వస్తే నేను బతకాలా చావాలా! వచ్చినప్పటినుంచి చూస్తున్నాను.. రకరకా ల రోగులు వచ్చారు. రకరకాల రోగాలు చెప్పారు. అడ్డమైన ప్రశ్నలు వేయటం చివరికి వేలెడంత సీసాలు తీసి తలాకాసిని తెల్లావాలు (మాత్రలు) ఇచ్చి పంపించటం అంతా హంబక్. నీకూ నీ వైద్యాని కో నమస్కారం. బతికుంటే బలుసాకు తిని బతకొచ్చు. దురదుం టే దురదగొండి ఆకు నూరి ఒళ్ళంతా పరపర పాముకుంటే సరి. అదే తగ్గుతుంది. ఉష్ణం ఉష్ణేన శీతలం. మా బామ్మ తరచు చెపుతుంటుంది. వేడికి వేడి విరుగుడు. దురదకి దురద గొండి ఆకే విరుగుడు. అంతే గాని పది రెట్లు పైకి రోగం వచ్చే నీకూ గుడ్ బై, నీ వైద్యానికీ గుడ్‌బై బరబర అందిన చోటల్లా గీరుగీరుమని ఆ మూలలు ఈ మూలలు గీరుకుంటూ మాటల్లో దడదడ బాంబులు పేల్చి నాలుక మీద దురద తీర్చుకుని అరికాళ్ళలో దురద తీరేలా దబ దబా అడుగులు వేసుకుంటూ సుబ్బారావు బైటికి వెళ్ళిపోయాడు.

ఆ దెబ్బతో జుట్టు పీక్కొంటూ తల బరుక్కుంటూ అలానే కుర్చీలో నీలుక్కుపోయి కూర్చుండి పోయాడు వెంగళాచారి.

సుబ్బారావుకి దురద పోయిందా లేదా! దురదగొండి ఆకు మెత్తగ నూరి ఒళ్ళంతా పట్టించుకున్నాడా! అంటే నాకు తెలియదనే చెపుతా ను. ఎందుకంటే (దురద) సుబ్బారావు కథలోని పాత్ర గాబట్టి.. మీ కెక్కడైనా ఎవరైనా గోక్కుంటూ కనపడితే సుబ్బారావుని తలుచు కోండి చాలు. ఆ దురద మీకంటదు. అంతే.

(ఈ కథ చదివిన తరువాత చదువరులకి దురద పుట్టకుండుగాక. దురద పుట్టిన తరువాత గోక్కున్నంత హాయిగ ఆనందంగ ఆహ్లాదం గ ఉండుగాక).

